




ప్రజా **రిపబ్లిక్**
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 209 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | బుధవారం 05 మార్చి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం:విజయ్

**నియోజకవర్గాల పునర్విభజనపై తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ స్పందించారు.**

మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): లోక్సభ నియోజకవర్గాల పునర్విభజన పై కేంద్రలోని భాజపా, ఇతర రాష్ట్రాల్లోని పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందన్నారు. దీన్ని అంగీకరించమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఆయా రాష్ట్రాలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి.



ఈ విభజన ప్రక్రియ తాజా జనాభా లెక్కల ఆధారంగా ఉంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. దీన్ని ఏమాత్రం అంగీకరించం. గత 50 ఏళ్లుగా తమిళనాడుతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలు జనాభా పెరుగుదలను నియంత్రించాయి. ఈక్రమంలో ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలు విభజించడం సరికాదు. ఒకరి గెలుపు కోసం ఇంకొకరిని శిక్షించడం అన్యాయం. దక్షిణాది రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్య తగ్గినా.. ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఆ సంఖ్య పెరిగినా సహించేది లేదు. అన్ని పార్టీలతో కలిసి దీనిపై పోరాడతాం. ప్రజాప్రతినిధుల కొరత సాధారణ ప్రజలకు సమస్యే కాదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, వైద్యం, రోడ్లు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందు వాటిపై దృష్టి సారించాలి' అని ప్రకటనలో పేర్కొన్నారు. లోక్సభ నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయంటూ తమిళనాడు కొంతకాలంగా చెబుతోంది. ఈ వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్షా కొట్టిపడేశారు. అయినప్పటికీ దీనిపై పలు రాష్ట్రాల తమ ఆందోళనను వ్యక్తంచేస్తున్నాయి. ఇక, ఈ అంశంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అందులో 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు

# ఎమ్మెల్యే నిర్వాకం...
## గుట్కా నిషేధిస్తూ యూపీ అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం

అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా తినడాన్ని నిషేధిస్తూ ఉత్తరప్రదేశ్ స్పీకర్ సతీశ్ మహాన ఆదేశాలు జారీ చేశారు. ఒక ఎమ్మెల్యే చేసిన నిర్వాకమే అందుకు కారణం.

లఖ్‌నవూ, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఒక ఎమ్మెల్యే గుట్కా తిని కార్పెట్ పై ఉమ్మివేయడంపై స్పీకర్ సతీశ్ మహాన ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన దీని వినియోగంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా తినడంపై నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మంగళవారం బడ్జెట్ సమావేశం జరగడానికి ముందు అసెంబ్లీలోకి వస్తున్న సమయంలో కార్పెట్పై గుట్కా గుర్తులను స్పీకర్ గమనించారు. "ఈ నిర్వాకం చేసిన ఎమ్మెల్యే ఎవరో నాకు తెలుసు. వీడియోలో నేనంతా చూశాను. కానీ, ఎవరినీ కించపరచాలని అనుకోవడం లేదు. అందుకే వారి పేరును ప్రస్తావించను. ఎవరైన ఇకపై ఇలాంటి పని చేస్తున్నట్లయితే మిగిలిన సభ్యులు దాన్ని అడ్డుకోవాలని కోరుతున్నాను. అసెంబ్లీని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత. ఇలా చేసిన ఎమ్మెల్యే వచ్చి తప్పును అంగీకరిస్తే బాగుంటుంది. లేదంటే అతడిని నేనే పిలుస్తాను" అని సతీశ్ మహాన హెచ్చరించారు.

### ఇదేమీ వ్యక్తిగత ఆస్తి కాదు..

అనంతరం దగ్గరుండి కార్పెట్ను శుభ్రం చేయించారు. ఒక వ్యక్తి చేసిన పనికి మిగిలిన వారి గౌరవం ఎందుకు దెబ్బతినాలంటూ స్పీకర్ ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రజలకు చెందిందని.. ఇదేమీ వ్యక్తిగత ఆస్తి కాదంటూ మండిపడ్డారు. అసెంబ్లీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ గా మారాయి. అయితే.. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా, పాన్ మసాలా వినియోగించడంపై ఆయన నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.1000 జరిమానా విధించనున్నారు.

# నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగ కల్పన సాధ్యం.. వెబినార్‌లో ప్రధాని మోదీ

**నైపుణ్యం, ప్రతిభను పెంపొందించడం ద్వారానే ఉద్యోగ కల్పన సాధ్యమవుతుందని ప్రధాని మోదీ అన్నారు.**

దిల్లీ, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): ప్రజల్లో నైపుణ్యాభివృద్ధి, ప్రతిభను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోనే ఉద్యోగ కల్పన సాధ్యమవుతుందని ప్రధాని మోదీ అన్నారు. అప్పుడే ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని చెప్పారు. ఇందుకు భాగస్వామ్యపక్షాలన్నీ కలిసి రావాలని, నైపుణ్యాభివృద్ధికి, ఆవిష్కరణలకు తోడ్పాటు అందించాలని కోరారు. బడ్జెట్ అనంతరం ఉద్యోగ కల్పన అంశంపై నిర్వహించిన వెబినార్‌లో ఆయన పాల్గొని బుధవారం మాట్లాడారు.



2014 నుంచి ఇప్పటి వరకు 3 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ అందించామని ప్రధాని మోదీ తెలిపారు. 1000 ఐటీఐలను అప్గ్రేడ్ చేయడంతో పాటు, ఐదు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ కేంద్రాలను నెలకొల్పాలనుకుంటున్నట్లు చెప్పారు. దేశ అభివృద్ధికి ప్రతిభ, సామర్థ్యాల పెంపు మూల స్తంభాలని పేర్కొన్నారు. దేశ విద్యా విధానం ప్రస్తుతం పరివర్తన చెందుతోందన్నారు. భారత్ ప్రస్తుతం 3.8 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని చెప్పారు. ఏఐ సామర్థ్యాలను పెంచుకోవడం కోసం త్వరలో నేషనల్ లార్జ్ లాంగ్వేజీ మోడల్ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ ఈ సందర్భంగా తెలిపారు.

# తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి సీతక్క

**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో అధికారంలోకి వచ్చిందని మంత్రి సీత్క అన్నారు.**

హైదరాబాద్, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో అధికారంలోకి వచ్చిందని మంత్రి సీత్క అన్నారు. కొందరు భాజపా, భారాస గొంతుకలై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై స్పందించిన సీతక్క.. కులగణనపై అభ్యంతరాలు ఉంటే శాసనమండలిలో మాట్లాడొచ్చని సూచించారు.



భారాస చేయలేనిది తాము చేశామని అభినందించాల్సింది పోయి విమర్శిస్తారా అని అగ్రహం వ్యక్తం చేశారు. తీన్మార్ మల్లన్న బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కులగణన సర్వేపై విమర్శలు చేశారు. తనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పటికీ బీసీ ఉద్యమం ఆగదని అన్నారు. "కులగణన దేశానికి ఆదర్శంగా ఉండాలి.. రాహుల్ గాంధీ తలెత్తుకుని తిరగాలని ఆశించాను. నూటికి నూరు శాతం పారదర్శకంగా సర్వే చేస్తేనే ఆదర్శంగా ఉంటుంది. అగ్రవర్ణాలను ఎక్కువగా చూపించి.. బీసీ వర్గాలను అణచిపెట్టే ప్రయత్నం చేశారు. నేను మాట్లాడింది తప్పు అయితే.. మళ్లీ కులగణనకు ఎందుకు సమయం ఇచ్చారు? బీసీ నేతలు కష్టపడితేనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది" అని మల్లన్న అన్నారు.

# మే నెలలో 'తల్లికి వందనం' అమలు:మంత్రి నారా లోకేశ్

**'తల్లికి వందనం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**

అమరావతి, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): 'తల్లికి వందనం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "తల్లికి వందనం' పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే ఇస్తాం. బడ్జెట్లో రూ.9407 కోట్లు ఈ పథకానికి కేటాయించాం. గత ప్రభుత్వంలో దీనికి ఏడాదికి రూ.5,540 కోట్లు కేటాయించారు, గతంతో పోలిస్తే ఇది 50శాతం అధికం. ఎన్నికలకు ముందు సూపర్-6 అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'తల్లికి వందనం' పథకాన్ని చంద్రబాబు ప్రకటించారు. మే నెలలో తప్పనిసరిగా ఇంటిలో ఎంతమంది చదువుకునే బిడ్డలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం" అని లోకేశ్ తెలిపారు.



# ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక.. విధివిధానాలపై కోర్ కమిటీ భేటీ

**ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కోర్ కమిటీ భేటీ అయింది.**



హైదరాబాద్, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కోర్ కమిటీ భేటీ అయింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొన్నారు. గంటకుపైగా కొనసాగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈనెల 29న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ ఏర్పడుతున్నాయి. వాటిని భర్తీ చేసేందుకు ఇప్పటికే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నెల 10న వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవడానికి గడువు విధించింది. ప్రధానంగా ఖాళీ ఏర్పడిన 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి భారాసకు, మిగిలినవి కాంగ్రెస్ పార్టీకి దక్కనున్నాయి. ఈ నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పీసీసీ కోర్ కమిటీ కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం నిర్వహించారు. మరోసారి సమావేశం కావాలని పీసీసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవులు కోసం పీసీసీకి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది.

# సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

**ఏపీ సీఎం చంద్రబాబును ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు.**



అమరావతి, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ సీఎం చంద్రబాబును ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసులు నాయుడును సీఎం అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారిని గౌరవిస్తామని చంద్రబాబు చెప్పారు. సీఎంకు శ్రీనివాసులు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో భాజపా నేత, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరు ఖరారు

**ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన నేత నాగబాబు పేరు ఖరారైంది.**



అమరావతి, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు, జనసేన నేత నాగబాబు పేరు ఖరారైంది. ఎమ్మెల్యే కోటా అభ్యర్థిగా ఆయన పేరును జనసేన అధినేత పవన్ ఖరారు చేశారు. నామినేషన్ వేయాలని నాగబాబుకు ఆయన సమాచారం ఇచ్చారు. కొద్దిరోజుల కిందట ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు తెదేపా, ఒకటి భాజపా తీసుకున్నాయి. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక సమయంలో నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోబోతున్నట్లు తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. పవన్ కల్యాణ్ కోరిక మేరకు తొలుత ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారు. ఎమ్మెల్యే - కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానం ఆయన కోసం కేటాయించారు. తీరా శాసనమండలి ఎన్నికల షెడ్యూలు వెలువడిన తరువాత నాగబాబుకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, తాజాగా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగానే నాగబాబు పేరును ఖరారు చేశారు.

# ప్రతిపక్ష హోదాపై జగన్ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు

**శాసనసభలో ప్రతిపక్ష హోదాపై వైకాపా అధినేత జగన్ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేశారు.**



అమరావతి, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్):శాసనసభలో ప్రతిపక్ష హోదాపై వైకాపా అధ్యక్షుడు జగన్ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేశారు. సభలో ఇంతమంది సభ్యుల బలం ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇవ్వాలనే రూలింగ్ ఎక్కడా లేదన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. "గత అసెంబ్లీలో తెదేపా సభ్యులు 10 మందిని లాక్కోకుండా చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా నేనే ఇచ్చా. మా వాళ్లు అయితే 10 మంది తెదేపా ఎమ్మెల్యేలను లాగేద్దాం అన్నారు" అని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యలపైనా జగన్ స్పందించారు. అధికార పార్టీ మీదే.. ప్రతిపక్ష పార్టీ మీదే.. ఇదేమైనా డబుల్ యాక్షనా? పవన్.. కార్పొరేటర్కు ఎక్కువ.. ఎమ్మెల్యేకు తక్కువ.. ఆయన జీవితంలో ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు" అని జగన్ వ్యాఖ్యానించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1827:** ఫ్రెంచి గణిత, ఖగోళ శాస్త్రజ్ఞుడు పియర్ సైమన్ లాప్లేస్ మరణం (జ.1749).
- **1901:** రంగస్థల, సినిమా నటుడు, గాయకుడు కల్యాణం రఘురామయ్య జననం (మ.1975).
- **1913:** కిరాణా ఘరానాకు చెందిన హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు గంగూబాయి హానగల్ జననం (మ.2009). (చిత్రంలో)
- **1931:** గాంధీ– ఇర్విన్ ఒడంబడిక కుదిరింది.
- **1937:** కథకుడు, నవలాకారుడు, నాటకకర్త, నటుడు నెమలికంటి తారకరామారావు జననం.
- **1953:** రష్యా నేత సోవియట్ యూనియన్‌కు బ్యూరోక్రాటిక్ పాలకుడు జోసెఫ్ స్టాలిన్ మరణం (జ.1878).
- **1987:** రష్యా టెన్నిస్ క్రీడాకారిణి అన్నా చక్వతడ్జే జననం.


పియర్ సైమన్ లాప్లేస్



కల్యాణం రఘురామయ్య


గంగూబాయి హానగల్


నెమలికంటి తారకరామారావు


జోసెఫ్ స్టాలిన్


అన్నా చక్వతడ్జే

# ఓటీటీలోకి 'లైలా'.. అధికారికంగా ప్రకటించిన సంస్థ

'లైలా' సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది.



విశ్వక్సేన్ లేడీ గెటప్ లో కనిపించిన చిత్రం 'లైలా'. భారీ అంచనాల మధ్య ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆశించిన మేర అంచనాలను అందుకోలేకపోయింది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఆహా వేదికగా మార్చి 7 నుంచి అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని ఆహా అధికారికంగా తెలుపుతూ పోస్ట్ పెట్టింది. 'లైలా'తో ప్రేమలో పడండి అంటూ పోస్టర్ షేర్ చేసింది. రామ్నారాయణ్ దర్శకత్వం వహించిన 'లైలా'లో విశ్వక్ సరసన ఆకాంక్ష శర్మ నటించారు. కథేంటంటే: సోనూ మోడల్ అలియాస్ సోనూ (విశ్వక్ సేన్) ఓల్డ్ సిటీలో బ్యూటీ పార్లర్ నడుపుతుంటాడు. అతని మేకప్ స్టైల్ చూసి మహిళలు ఎంతగానో ఇష్టపడుతుంటారు. చిన్నప్పుడే చనిపోయిన తన తల్లి నేర్పించిన విద్యతో, ఆమె జ్ఞాపకంలా పార్లర్ని నిర్వహిస్తుంటాడు. ఎవరికి కష్టం వచ్చినా ఆదుకుంటుంటాడు. అనుకోకుండా ఆయన్ని సమస్యలు చుట్టు ముడతాయి. వాటినుంచి గట్టెక్కాలంటే పారిపోవడమే మార్గం అని సలహా ఇస్తారు స్నేహితులు. సోనూ అలా చేయకుండా లైలా (విశ్వక్ సేన్) అనే అమ్మాయిగా గెటప్ మార్చేస్తాడు. అలా ఎంతకాలం తప్పించుకు తిరిగాడు? లైలా అమ్మాయి కాదని సోనూ అని తెలిశాక చోటుచేసుకున్న పరిణామాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

రిపబ్లిక్ సినిమా CINEMA

# పబ్లిసిటీ కంటే గోప్యత ముఖ్యం : యామీ గౌతమ్

ప్రతీ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకోవాల్సిన అవసరం లేదని యామీ గౌతమ్ అన్నారు.



చాలామంది సెలబ్రిటీలు వారి జీవితాల్లో జరిగే ప్రతి విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటుంటారు. వారు తినే ఆహారం నుంచి ఖాళీ సమయాల్లో ఎలా గడుపుతారన్న అంశం వరకు ప్రతీది వివరిస్తుంటారు. అయితే, యామీ గౌతమ్ మాత్రం తాను ఇందుకు పూర్తి భిన్నమని చెప్పారు. తన వ్యక్తిగత జీవితంలోని ప్రతీ చిన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం లేదన్నారు. "సోషల్ మీడియా గురించి, ప్రస్తుత పరిస్థితుల గురించి నాకు బాగా తెలుసు. నాకూ సోషల్ మీడియా అకౌంట్ ఉంది. కానీ నేను బ్రేక్ఫాస్ట్ ఏం చేశాను.. జిమ్లో గాయపడ్డాను.. ఇలాంటి చిన్న చిన్న విషయాలను అందరితో షేర్ చేసుకోను. నేను వ్యక్తిగత విషయాలను బయటకు చెప్పను. అలా పంచుకోవడం నాకు నచ్చదు. అంత అవసరం కూడా లేదని నా అభిప్రాయం. నా గురించి ప్రజలు ఆలోచించాలని నేను కోరుకోవడం లేదు. వాళ్లకు ఎంత తక్కువ తెలిస్తే.. నేను పోషించే పాత్రకు ప్రేక్షకులు అంత ఎక్కువ కనెక్ట్ అవుతారు" అని అన్నారు. తన కుమారుడి గురించి మాట్లాడుతూ.. వాడిని మీడియాకు దూరంగా పెంచాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అది తాను తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమన్నారు. అతడు ఒక సెలబ్రిటీ కుమారుడిలా కాకుండా సాధారణంగా పెరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. టెలివిజన్లో ప్రకటనలతో ఎంతో పాపులారిటీ సొంతం చేసుకున్నారు నటి యామీ గౌతమ్. 'నువ్విలా'తో తెలుగు ప్రేక్షకులను పలకరించి ఆ తర్వాత పలు బాలీవుడ్ సినిమాలతో హిట్స్ అందుకున్నారు. అదే సమయంలో 'గౌరవం', 'యుద్ధం', 'కొరియర్ బాయ్ కల్యాణ్' చిత్రాలతో టాలీవుడ్ ప్రేక్షకులను అలరించారు.

# తండ్రిని కాబట్టి నేనీ మాట చెప్పడం లేదు: అభిషేక్‌కు అమితాబ్ సపోర్ట్

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్‌ను ఉద్దేశించి ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్ఫు ఆయన తండ్రి అమితాబ్ బచ్చన్ స్పందించారు. నెటిజన్ మాదిరిగానే తాను ఫీలవుతున్నానని అన్నారు.

బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు నటుడు అభిషేక్ బచ్చన్. కెరీర్ పరంగా ఆయన ఎన్నో విమర్శలు ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఓ నెటిజన్ తాజాగా అభిషేక్ ను సపోర్ట్ చేస్తూ పోస్ట్ పెట్టాడు. "ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించినప్పటికీ అభిషేక్ బచ్చన్ అనవసరంగా నెపో కిడ్ అనే విమర్శలు ఎదుర్కొంటున్నారు" అని రాసుకొచ్చాడు. దీనిపై అమితాబ్ బచ్చన్ స్పందించారు. "నిజం చెప్పాలంటే నాక్కూడా ఇదే ఫీలింగ్ ఉంది. తండ్రిని కాబట్టి నేను ఈ మాట చెప్పడం లేదు" అని పేర్కొన్నారు. 'రిఫ్యూజీ'తో నటుడిగా మారారు నటుడు అభిషేక్ బచ్చన్. 'యువ', 'ధూమ్', 'గురు', 'ఢిల్లీ 6' వంటి విభిన్నమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. అయినప్పటికీ కెరీర్ విషయంలో ఆయన పలు విమర్శలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ముఖ్యంగా నెపోటిజం (బంధుప్రీతి) వల్లే ఆయన పరిశ్రమలో కొనసాగుతున్నారంటూ ఎంతోమంది వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. దీనిని ఉద్దేశించి అభిషేక్ ఇప్పటికే స్పందించారు. తండ్రి వల్లే తాను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ.. టాలెంట్ లేకపోతే ఇక్కడ కొనసాగడం కష్టమని గతంలో ఇంటర్వ్యూలో చెప్పారు. "కెరీర్ విషయంలో నాన్న నాకెప్పుడు సాయం చేయలేదు. నాతో సినిమాలు చేయమని ఎవరినీ కోరలేదు. అంతేకాకుండా నా సినిమాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించలేదు. నేను మాత్రం ఆయన నటించిన 'పా' చిత్రానికి బడ్జెట్ పెట్టా" అని వెల్లడించారు.



రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# రోహిత్ భవిష్యత్తుపై ఇప్పుడెందుకు చర్చ?: గౌతమ్ గంభీర్

భారత కెప్టెన్ రోహిత్ శర్మపై ప్రధాన కోచ్ గంభీర్ ప్రశంసల వర్షం కురిపించాడు. జట్టును ముందుండి నడిపిస్తూ ఫైనల్ కు తీసుకెళ్లాడని పేర్కొన్నాడు.



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత సారథి రోహిత్ శర్మ దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నాడు. కానీ, వాటిని భారీ స్కోర్లుగా మలచడంలో మాత్రం విఫలం కావడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. ఈ టోర్నీ ముగిసిన తర్వాత అతడి భవిష్యత్తు ఏంటనేది సగటు అభిమాని మనసులో మెదిలే ప్రశ్న. దానికి గౌతమ్ గంభీర్ కూడా సూటిగా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. అలాగే రోహిత్ ప్రస్తుత ఫామ్ గురించి గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్లో ఆసీస్పై భారత్ విజయం సాధించిన అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్లో గంభీర్ మాట్లాడాడు. ఈ సందర్భంగా ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు గంభీర్ స్పందించాడు.

**జర్నలిస్ట్:** రోహిత్ ఫామ్ గురించి.. అతడి భవిష్యత్తు గురించి మీరు ఏమనుకుంటున్నారు? ఎంతవరకు ఆడగలడని మీరు భావిస్తున్నారు?

**గంభీర్:** ఇప్పుడు మనం ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోకి అడుగుపెట్టాం. ఇలాంటి సమయంలో కెప్టెన్ భవిష్యత్తు గురించి ఎందుకు మాట్లాడుకోవడం. దూకుడైన ఆటతీరుతో కెప్టెన్ ఆడుతుంటే అంతకంటే ఇంకేం కావాలి. డ్రెస్సింగ్ రూమ్కు సానుకూల సంకేతాలు ఇవ్వడంలో రోహిత్ ముందుంటాడు. నిర్భయంగా ఆడేందుకు అతడే దిక్సూచి. మీరు పరుగులనే చూస్తారు. మేం అతడి ప్రభావం ఎంతనేది గణిస్తాం. అదే మీకు, మాకు తేడా. జర్నలిస్టులు, విశ్లేషకులు ఎవరైనా సరే ఒక ఆటగాడి గణాంకాలను చూస్తారు. కానీ కోచ్గా, జట్టు మేనేజ్మెంట్గా మేం వాటి గురించి ఆలోచించం. కెప్టెన్గా జట్టును ముందుండి నడిపిస్తున్నాడా లేదా అనేది చూస్తాం. అంతకంటే ఇంకేమీ అవసరం లేదు.

## ఆరోగ్యం

# ఇంత ప్రమాదమా! ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయను తింటే ఏమవుతుందో తెలుసా?

చాలా మంది పుచ్చకాయను కట్ చేసి తిన్న తర్వాత కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తింటారు. అయితే, ఇలా తినడం వల్ల ఏమవుతుందో తెలిస్తే మీరు ఆ పని చేయరు.

వేసవి కాలం వచ్చేసింది. ఈ సీజన్‌లో పుచ్చకాయను ఎక్కువగా తింటారు. పుచ్చకాయల దాదాపు 90 శాతం నీటితో నిండి ఉంటుంది. ఇది వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. ఇప్పటికే మార్కెట్లో పుచ్చకాయలు విరివిగా లభిస్తున్నాయి.. పుచ్చకాయలో విటమిన్ ఏ,బి కాంప్లెక్స్ సి పొటాషియం మీ చర్మానికి పోషణ అందిస్తాయి. వీటితో పాటు.. పుచ్చకాయలోని లైకోపీన్, బీటా - కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎండాకాలంలో డీహైడ్రేట్ అవ్వకుండా పుచ్చకాయ కాపాడుతుంది. అయితే, చాలా మంది పుచ్చకాయను కట్ చేసి తిన్న తర్వాత కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తింటారు. అయితే, ఇలా తినడం వల్ల ఏమవుతుందో తెలిస్తే మీరు ఆ పని చేయరు. ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తినడం వల్ల కలిగే ప్రమాదాలేంటో తెలుసుకుందాం.



### ఫ్రిజ్‌లో పెట్టి తింటే డేంజర్



చాలా మంది పుచ్చకాయను తెచ్చుకున్న తర్వాత కట్ చేసి కొంత భాగం తింటారు. మరి కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో పెడతారు. ఆ తర్వాత తినాలనిపించినప్పుడు మిగిలిన భాగాన్ని తింటారు. మీకు కూడా ఈ అలవాటు ఉంటే వెంటనే మానేయండి. ఇలాంటి పుచ్చకాయ తినడానికి రుచిగా, చల్లగా ఉంటుంది. అయితే, ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తుందంటున్నారు డాక్టర్ మీనాక్షి జైన్. ఆమె ప్రకారం ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయలో పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాకుండా ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదముంది.

### పోషకాలు నశిస్తాయి



పుచ్చకాయను ఫ్రిజ్‌లో ఉంచితే లైకోపీన్, సిట్రులిన్, విటమిన్ ఎ, విటమిన్ సి పరిమాణం తగ్గుతుందని డాక్టర్ మీనాక్షి జైన్ అంటున్నారు. ఇది మాత్రమే కాదు, కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల అది ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. కట్ చేసిన పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం వల్ల అందులో ఉండే చక్కెర పరిమాణం పెరుగుతుంది. దీంతో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం పెరుగుతుంది.

### వచ్చే సమస్యలు



- పుచ్చకాయను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల దాని పోషక విలువలు తగ్గుతాయి
- చల్లని పుచ్చకాయ తినడం వల్ల దగ్గు, జలుబు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.
- చల్లని పుచ్చకాయన తినడం వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ఛాన్స్ ఉంది
- చల్లని పుచ్చకాయలో ఉండే బ్యాక్టీరియా పేగుకు హాని కలిగిస్తుంది
- కడుపు సంబంధిత వ్యాధులు, జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

### గది ఉష్ణోగ్రత బెస్ట్



కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్‌లో పెట్టే బదులు దాన్ని గది ఉష్ణోగ్రత ఉంచాలంటున్నారు నిపుణులు. ఆ తర్వాత కొన్ని గంటలకే తింటే సరిపోతుందంటున్నారు. అంతేకాకుండా కట్ చేసిన పుచ్చకాయను రంధ్రాలు ఉన్న మూతతో కవర్ చేయాలంటున్నారు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచాల్సిన అవసరం లేదు ఎందుకంటే దాని బయటి పొర చాలా మందపాటి తొక్కను కలిగి ఉంటుంది, దీని కారణంగా అది త్వరగా చెడిపోదు.

### రాత్రి పూట తినకండి



పుచ్చకాయ చల్లని స్వభావం కలిగి ఉంటుంది. అయితే, రాత్రి పూట తినకూడదంటున్నారు నిపుణులు. రాత్రి పూట జీర్ణక్రియ మందగిస్తుంది. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో, కడుపులో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. రాత్రి పూట తినడం వల్ల తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో మీ నిద్ర పాడయ్యే అవకాశం ఉంది.

**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.